ప్రజాశక్తి

సోమవారం 18 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వార్త మెయిన్‌లో..

డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

సిబిఐ వలలో వాల్తేరు డిఆర్‌ఎం

కాంట్రాక్టరు నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

రోడ్డు దాటాలంటే భయం..!

◆ పెద్ద రాళ్ల లోడుతో తిరుగుతున్న భారీ వాహనాలు ◆ దెబ్బతింటున్న అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మునగపాక విలేకరి

అనకాపల్లి - అచ్యుతాపురం రహదారిలో అధిక బరువుతో కూడిన భారీ వాహనాల రాకపోకలతో అనేక చోట్ల రహదారి దెబ్బతింది. దీంతో ప్రజానీకం ఇబ్బందులు పడుతోంది. ఈ రహదారిలో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. భారీ వాహనాలను నియంత్రించాలని రహదారికి ఆనుకొనివున్న గ్రామస్తులు పలువురికి తెలియజేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు. పిల్లలు, పెద్దలు రోడ్డు దాటడానికి భయపడుతున్నారు. బ్రాండిక్స్, ఫార్మా, ఎస్ఇజెడ్‌లకు ఉద్యోగులు వెళ్లే బస్సులే కాకుండా పెద్దపెద్ద రాళ్లు తీసుకొని వెళ్తున్న వాహనాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన ఇక్కడివారిలో నెలకొంది. ఎన్ఎఓబి, ఎస్ఇజెడ్ పరిశ్రమలకు రాళ్లు, ఇతర నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లే భారీ వాహనాలకు గతంలో నిర్దిష్ట కాలం విధించారు. పగటిపూట కాకుండా రాత్రి సమయాల్లో తిరగడానికి పోలీసులు పరిమితి ఇచ్చారు. కొంతకాలంగా ఆ పరిమితులన్నీ పోయాయి. క్యూ కట్టినట్లు అనకాపల్లి నుంచి పెద్దరాళ్ల భారీ వాహనాలు వరుస వస్తున్నాయి. పగటిపూట రోడ్డు దాటడానికి కూడా భయపడేలా వాహన రాకపోకలున్నాయి.

వాహనాల్లోని రాళ్లు కనబడకుండా టార్పాన్ కట్టినా ఇంజిన్ ఎత్తులో రాళ్లు తీసుకెళ్లడంతో అవి జారి కిందపడుతున్నాయి. అయినా వాహనదారులు పట్టించుకోవడంలేదు. ఎన్నికల ముందు వేసిన ఈ రహదారి బరువు కలిగిన వాహనాలతో మిగతా 2లో..

రాళ్లు తీసుకెళ్తున్న వాహనం

సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

డెయిరీ కార్మికుల సమస్యలపై పోరాటాలు

విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలపై పోరాటాలు చేపట్టనున్నట్టు విశాఖ కో - ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 21 నుంచి నిరాహార దీక్షలు చేపట్టనున్నామన్నారు. విశాఖ డెయిరీలో 1979లో సిఐటియు యూనియన్ ఏర్పాటు చేశామని, నాడు సిఐటియు చేసిన అగ్రిమెంట్ కారణంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా విశాఖ డెయిరీలో కార్మికులకు జీతభత్యాలు ఉండేవన్నారు. దీనిని చూసి మిగతా డెయిరీల్లోని కార్మికులు కూడా కార్మిక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. నేడు విశాఖ డెయిరీలో 20 సంవత్సరాలుగా యూనియన్ లేకపోవడంతో కార్మికుల హక్కులు అణచివేతకు గురవుతున్నాయన్నారు. పర్మినెంట్ కార్మికులుగా పనిచేయాల్సిన వారు కాంట్రాక్టు లేబర్, ట్రైనీ అగ్రిమెంట్ ఉద్యోగులు, ఇలా.. రకరకాల పేర్లతో తక్కువ జీతాలకు పనిచేస్తున్నారన్నారు. గడిచిన 20 సంవత్సరాలుగా యాజమాన్యం కార్మిక సమస్యలను పరిష్కరించకుండా గాలికి వదిలేసిందన్నారు. సంఘం పెట్టుకునే హక్కు లేదని చెప్పడం తగదన్నారు. ఏడుగురు వ్యక్తులు ఉంటే ట్రేడ్ యూనియన్ పెట్టుకునే హక్కు ఉందన్నారు. డిమాండ్లను నెరవేర్చాలని కోరితే యూనియన్ లేకుండా కార్మికులు రావాలని చెప్పడం సరికాదన్నారు. డెయిరీలో చేస్తున్న పోరాటంలో కార్మికులతో పాటు రైతులను కూడా కలుపుకుని ముందుకుపోవాలన్నారు. డెయిరీలో కొంతమంది డైరెక్టర్లు సంఘం డబ్బును దోచుకు మిగతా 2లో..

తనిఖీల్లో నిర్లక్ష్యం వల్లే పరిశ్రమల్లో ప్రమాదాలు

▶ వార్త 5లో..

జూకు రూ.7.64 లక్షల ఆదాయం

▶ వార్త 4లో..

అక్రమ క్వారీని నిలుపుదల చేయాలి

▶ వార్త 5లో..

నగర వనం, పర్యాటకానికి ప్రాధాన్యత

◆ రూ.60 లక్షలతో నర్సరీల అభివృద్ధి

◆ 'ప్రజాశక్తి'తో విశాఖపట్నం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం.దివాన్ మైదీన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరవనం, టూరిజానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు విశాఖపట్నం సర్కిల్ అటవీ సంరక్షణాధికారి బిఎం దివాన్ మైదీన్ వెల్లడించారు. వృక్షజాల పరిరక్షణను సులభతరం చేయడం, కాలుష్యాన్ని తగ్గించి.. స్వచ్ఛమైన గాలిని అందించడం, వన్యప్రాణుల కోసం విశాఖ కంబాలకొండ ప్రాంగణంలో ఇప్పటికే ఎకో టూరిజం పార్క్ ఉన్నందున నగరవనం పథకాన్ని అటవీశాఖ ఆధ్వర్యాన మరింత విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

నగర వనం లక్ష్యమేంటి ?

ప్రతి మున్సిపాల్టీ పరిధిలోనూ అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ మార్గం, వినోద ప్రదేశం అందించడం కేంద్ర ప్రభుత్వ నగర వనం ప్రాజెక్టు లక్ష్యం. కొత్తగా ఫారెస్ట్ ఏరియాల్లో నర్సరీల అభివృద్ధికి భూమిని గుర్తించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. నగర వనం అంటే ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల కోసం కొంత స్థలాన్ని అభివృద్ధి చేయడం. దీనిని ఎపి డిజాస్టర్ రిలీఫ్ ప్రాజెక్టు (ఎపిడిఆర్‌పి) అంటారు. ప్రకృతి మిగతా 2లో..

క్రాంతి ప్రోపర్టీస్ 12వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

భూమిపై పెట్టుబడి తరతరాలకు రాబడి... పారిశ్రామిక రంగంలో ఆసియాలోనే
అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం, దేశపాత్రునిపాలెం మరియు
కొత్తవలసలో విఎంఆర్‌డిఎ అప్రూవల్‌తో అన్ని వర్గాల వారికి అందుబాటులో వెంచర్లు కలవు

APPROVED BY LP.No. 03/2019 VUDA
SRI KRISHNA GARDENS @ GOLD STAR JUNCTION - KOTHAVALASA

VMRDA VK- PCPIR UDA LP. NO.: 02/2021 APPROVED
Kranthi ENCLAVE @ Maduthuru Jn., Atchutapuram

VMRDA LP. NO.: 103/2021 APPROVED
VIMALA ENCLAVE @ Desapatrunipalem Jn., Paravada

KP sign of prosperity
ISO 9001:2008 Certified

KRANTHI PROPERTIES
✓ Promoters ✓ Builders ✓ Developers
H.O. Gajuwaka | C.O. Visakhapatnam | B.O. Pendurthi

మొదటి పేజీ తరువాయి..

పెద్ద మదుం వద్ద కుంగిన రహదారి

రోడ్డు దాటాలంటే భయం..!

కొన్నిచోట్ల పాడైంది. భారీ వాహనాలు తిరగకూడదని రహదారి ప్రవేశంలో పెట్టిన బోర్డులను ఎవరూ లెక్కచేయడంలేదు. భారీ వాహనాలను రవాణాశాఖ నియంత్రించే చర్యలు తీసుకోవడంలేదు. ఆర్అండ్బి శాఖ పట్టించుకోవడం మానేసింది. ఫలితంగా ఆ పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అధిక బరువు వాహనాలతో మునగపాక, హరిపాలెం బ్రిడ్జిలు దెబ్బతినే అవకాశముందని గ్రామస్తులు తెలిపారు. అవి పాడైతే రాకపోకలు నిలిచిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం ఎక్సైజ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో నిర్వహించిన సమావేశంలో భారీ వాహనాలను అరికట్టాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపిన విషయం విదితమే

నగర వనం, పర్యాటకానికి ప్రాధాన్యత

మధ్య నడవడం ఇతర వాటితో పోల్చితే భిన్నమైన అనుభూతిని ఇస్తుంది. నగరానికి ఇలాంటి పార్కుల అవసరం ఎంతైనా ఉంది.

నగరవనం ఎలా అమలు చేస్తారు ?

కంబాలకొండలో ఇప్పటికే పూర్తిచేశాం. ఎకో టూరిజానికి తగ్గట్టుగా కంబాలకొండను చాలా వరకూ తీర్చిదిద్దాం. నగర వనం భావనకు అటవీ శాఖ కార్యరూపం ఇచ్చే ప్రణాళికలతో ముందుకు సాగుతోంది. ఇది 17 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కంబాల కొండ వన్యప్రాణుల అభయారణ్యంలో 450 ఎకరాలకుపైగా అటవీ శాఖ ఎకో టూరిజం పార్క్, సెంట్రల్ నర్సరీ, స్మృతివనం, యానిమల్ రెస్క్యూ సెంటర్ (ఎఆర్సి) నిర్వహిస్తోంది. టూరిస్టులు, ప్రజలను కంబాలకొండ ప్రదేశం సరికొత్త సహజసిద్ధమైన హంగులతో ఆకట్టుకుంటోంది.

నగరవనాలను ఎక్కడెక్కడ అభివృద్ధి చేశారు ?

విశాఖలో కంబాల కొండలో అభివృద్ధి చేశాం, అనకాపల్లి జిల్లాలో బయ్యవరం, విజయనగరం జిల్లాలో సారిపల్లి, బేతనపల్లి, వెలగాడ, శ్రీకాకుళం జిల్లాలో కాశీబుగ్గల్లో అభివృద్ధి చేశాం. ఉమ్మడి విశాఖలోగల యలమంచిలి, నర్సీపట్నం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం. తాటిపూడిని బాగా అభివృద్ధి చేయాల్సి ఉంది. లంబసింగి, అనంతగిరిలోనూ టూరిజం అభివృద్ధికి అశేష కృషి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశాం. 60 లక్షల నర్సరీలను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్ఇజిఎస్) అమలులో భాగంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. వాటితో ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అటవీశాఖ కృషి చేపట్టింది. ప్రతి మున్సిపాల్టీలోనూ నగరవనం కింద రూ.2 కోట్లును నగర వనం కింద ఖర్చుచేయనున్నాం. అయితే, జిల్లాల కలెక్టర్లు ఇంకా కొంతమంది నగర వన పనులకు అడ్మినిస్ట్రేటివ్ ఆమోదం ఇవ్వాల్సి ఉంది. అనకాపల్లి జిల్లా పరిధిలోని యలమంచిలి, నర్సీపట్నం ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద నర్సరీల అభివృద్ధికి ప్రతిపాదనలను కేంద్రానికి పంపాం.

డెయిరీ కార్మికుల సమస్యలపై పోరాటాలు

తింటున్నారని విమర్శించారు. విశాఖ డెయిరీలో కార్మికులకు ప్రమోషన్ పాలసీ లేదని, ఫీల్డ్ వర్క్లో సరైన పని గంటలు లేవని తెలిపారు. ఇక్కడి కార్మికులను యాజమాన్యం దోచుకుంటోందన్నారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24న కార్మిక సమస్యలపై పెద్ద ఎత్తున సభ పెడుతున్నట్లు తెలిపారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విశాఖ డెయిరీ సిఐటియు యూనియన్ నాయకులు బి.అప్పారావు మాట్లాడుతూ సంఘం ఉన్నప్పుడే డెయిరీలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెవి.మూర్తి, ఎస్.రమణ, ఉపాధ్యక్షులు ఎ.నరసన్న, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.నాయుడు, ఎల్విఎం.నాయుడు, ఎస్.త్రినాధరావు, కె.సత్యనారాయణ, వి.సతీష్ కుమార్, ఎన్.రాజేంద్రప్రసాద్, విశాఖ డెయిరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.రాంబాబు, సీనియర్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి దాడి నాగ మరణి బాబు, గొంతు మూర్తి, నాగేశ్వరరావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత డెయిరీలో పనిచేసి చనిపోయిన డి.శారద, రాంప్రకాష్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

క్రీడా స్ఫూర్తి కొనసాగించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : క్రీడాకారులు ఎల్లవేళలా క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. 29వ వార్డు పరిధి మహారాణిపేటలోని ఆంధ్ర మెడికల్ కళాశాల గ్రౌండ్స్లో నిర్వహించిన క్రికెట్ పోటీలలో విజేతలకు ఆదివారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాను రాను క్రీడా స్ఫూర్తి తగ్గుతోందన్నారు. క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి దక్షిణ ఇన్ఛార్జి సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిఓ నెంబర్ 3ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆదివాసీలకు ఏజెన్సీలో వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్ కల్పించే జిఓ నెంబర్ 3ని పునరుద్ధరించాలని అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. దీంతో పాటు 1/70 చట్టాన్ని, పెసా చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని, అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని కొనసాగించాలని, పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలని తీర్మానించింది. సంఘం విశాఖపట్నం జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం ఎంవిపి కాలనీ డబుల్ రోడ్డులోని గిరిజన భవన్లో జరిగింది. ముఖ్య అతిథులుగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు వి.తిరుపతిరావు, రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ హాజరయ్యారు. గత కార్యక్రమాలను సమీక్షించారు. అనంతరం గతంలో నాయకత్వం వహించిన నాయకులకు సన్మానాలు నిర్వహించారు. ప్రస్తుత కార్యదర్శి రూడా సత్యారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి కిముడు జానకిరాజు ఆదాయ వ్యయాల నివేదికలు సమర్పించారు. సమావేశంలో సంఘం విశాఖపట్నం అధ్యక్షులు అంబిడి కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు డిప్పల సాంబమూర్తి, ఉపాధ్యక్షులు కిముడు సూర్యనారాయణ, కార్యాలయ కార్యదర్శి సరమండ గీత, సహాయ కార్యదర్శి సూకూరు వీరన్న దొర, భవన్ కార్యవర్గ చైర్మన్ జన్ని రామన్న, కోశాధికారి పాంగి జగన్నాథం పాల్గొన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ గుమ్మడి కనకరాజు (50) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. తెల్లవారుజామున వ్యాయామం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే ఆయన కన్నుమూశారు. పోలీస్ లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ఎసిపిలు రాఘవేంద్రరావు, సీతారాం పాల్గొన్నారు.

కనకరాజు (ఫైల్ ఫొటో)

1995లో విధుల్లో చేరిన కనకరాజు 29 ఏళ్ల పాటు పలువురు ప్రముఖులకు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్గాను, పోలీసు జిమ్ ట్రైనర్గాను, క్యూఆర్టి టీం సభ్యునిగానూ అనేక విభాగాల్లో సేవలందించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, భార్య ఉన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం : పోలీస్ కమిషనర్

కనకరాజు మృతి విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, ఎసిపి అన్నెపు నరసింహమూర్తి హుటాహుటిన వచ్చి పార్థివ దేహం వద్ద నివాళ్లర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. కుమారుడికి వీలైనంత త్వరగా పోలీస్ విభాగంలో ఉద్యోగం ఇస్తామని, అదేవిధంగా ఆడపిల్లల చదువు నిరాటంకంగా కొనసాగేందుకు కావలసిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కుటుంబానికి రావలసిన బెనిఫిట్స్ అందజేస్తామన్నారు. దీనికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని కిందిస్థాయి అధికారులను ఆదేశించారు.

6న గాయని సునీత పాటల సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తాను విశాఖలో తొలిసారిగా లైవ్ ఫెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నట్టు ప్రముఖ గాయని సునీత తెలిపారు. డిసెంబర్ 6న బీచ్ రోడ్డులోని ఎంజిఎం పార్కులో తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని వెల్ కం హోటల్ దీవి గ్రాండ్ బేలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. నిర్వాహకులు నిఖిల్ విజయేంద్రసింహ, వినయ్ పారేపల్లి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ నిర్వీర్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాలకుల తీరుతో రానురాను విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతోందని ద్రవిడ యూనివర్సిటీ మాజీ విసి కెఎస్.చలం అన్నారు. ఎఐఎస్ఎఫ్ 32వ జిల్లా మహాసభలు ఆదివారం ఆంధ్ర యూనివర్సిటీ టిఎల్ఎన్ సభా హాల్లో జరిగాయి. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద సంఘం మాజీ నాయకులు డాక్టర్ క్షేత్రపాల్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కారక్రమంలో చలం మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగం పెరుగుతోందన్నారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు సంఘం బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

ప్రజాశక్తి - చింతపల్లి : విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జడ్పిటిసి పోతురాజు బాలయ్య అన్నారు. మండలంలోని లోతుగెడ్డ జంక్షన్లోనీ ప్రభుత్వ పాఠశాలను పెద బరడ సర్పంచ్ సమిడ గోపాల్తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తే పై తరగతుల్లో మంచిగా రాణిస్తారని అన్నారు.

విశాఖలో లక్ష్మీ హ్యుందాయ్ సర్వీస్ క్యాంపులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ లక్ష్మీ హ్యుందాయ్ ఆధ్వర్యాన బీచ్ రోడ్డులోని వైఎంసిఎ ప్రాంగణంలోనూ, అగనంపూడి వద్ద హ్యుందాయ్ ఆల్వేస్ అరౌండ్ పేరుతో సర్వీస్ క్యాంపులు నిర్వహించారు. ఈ క్యాంపులను జిఎస్టి రాష్ట్ర అదనపు కమిషనర్ ఎస్.శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీ హ్యుందాయ్ గ్రూప్ సిఇఒ డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆల్వేస్ అరౌండ్ ప్రోగ్రామ్ను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని అవుట్ లెట్లలో ఆదివారం నిర్వహించినట్లు తెలిపారు. సర్వీస్, స్పేర్స్పై మంచి డిస్కౌంట్స్తో పాటు సేల్స్ అండ్ ఎక్చేంజి విభాగంలో ఆఫర్స్ను అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ ఎజిఎం ఎమ్డి.ప్రసాద్, అకౌంట్స్ జిఎం జి.కిషోర్ కుమార్, సేల్స్, సర్వీస్, స్పేర్స్, ఎక్చేంజ్, యాక్సెసరీస్ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్వీస్ క్యాంపును ప్రారంభిస్తున్న శేఖర్

బీచ్ రోడ్డులో వాక్థాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డేను పురస్కరించుకుని విశాఖపట్నంలోని రెయిన్బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులోని కాళీ మాతా టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకూ వాక్థాన్ నిర్వహించారు. వైజాగ్లోని రెయిన్ బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్, నియోనాటాలజిస్ట్ అండ్ పీడియాట్రిషియన్ డాక్టర్ బాల శ్రీలత ఈ వాక్థాన్ను జెండా ఊపి ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలలు నిండక ముందే పుట్టిన శిశువులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రత్యేక సంరక్షణను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్, పీడియాట్రిషియన్ డాక్టర్ ఫణి ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆధ్వర్యాన..

ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే వేడుకలు విశాఖపట్నంలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ హాస్పిటల్స్లో నియోనాటాలజిస్ట్ డాక్టర్ సాయి సునీల్ కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులుగా విఎంఆర్డిఎ కమిషనర్ విశ్వనాథన్ హాజరయ్యారు.

మారథాన్లో పాల్గొన్న వైద్య సిబ్బంది

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు సూచించారు. మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగిన మెగా డ్యాన్స్ షోను ఆయన ప్రారంభిస్తూ మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా నిధులను సేకరించి, వాటిని నిరుపేదలకు ఖర్చు పెట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. అనంతరం డ్యాన్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. 27 సంప్రదాయ, జానపద, గిరిజన నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ పోటీల్లో 200 మందికిపైగా నృత్యం చేశారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆంధ్ర విశ్వవిద్యాలయ సంగీత, నాట్య విభాగ ఆచార్యులు డాక్టర్ కె.వి.విజయవేణి, ప్రముఖ నాట్య అధ్యాపకులు మీనా, కొరియోగ్రాఫర్ మధు వ్యవహరించారు. ద్వితీయ బికామ్ విద్యార్థినులు ప్రథమ స్థానాన్ని, తృతీయ బికామ్ విద్యార్థినులు ద్వితీయ స్థానాన్ని పొందారు. తృతీయ స్థానాన్ని ద్వితీయ బిఎస్‌సి, ఇంటర్ ఒకేషనల్ విద్యార్థినులు సంయుక్తంగా కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సాంస్కృతిక ప్రదర్శన, ఫుడ్ ఫెస్టివల్ ద్వారా వచ్చిన నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి తెలియజేశారు. నిర్వాహకులను సెయింట్ ఆన్స్ ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ సాండ్రినా అభినందించారు.

విస్తృతంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. అమనాం పంచాయితీలోని పలు గ్రామాల్లో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి విస్తరణాధికారి కనకల రమేష్‌నాయుడు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కాల్వల్లో చెత్తను తొలగించారు. పారిశుధ్య నిర్వహణపై సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత పంచాయతీ కార్యాలయంలో ఉన్న సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ సుమారు వంద మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన సుమారు 2000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, షిణగం చిన్న రామారావు, చందక అప్పలస్వామి, శంకరరావు, ఉప సర్పంచ్ బంటుబిల్లి రవణమ్మ, కె.సత్యమూర్తి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని కణమాం పంచాయతీ గోరింట, ఎర్రవానిపాలెం, సింహాద్రి మెరక, అరిగిమెరక దుర్గాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఆదివారం నిర్వహించారు. గోరింటలో జరిగిన ఈ కార్యక్రమానికి తిరుమల తిరుపతి దేవస్థానం సహకారం అందించింది. వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ రూ.50 వేలు విరాళం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ చిరంజీవిరావు

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ప్రజాశక్తి -తగరపువలస : విద్యా శాఖలో కీలకంగా ఉన్న సిఆర్‌పిల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషిచేస్తానని ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు హామీ ఇచ్చారు. స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎపి, సిఆర్‌పి ఫెడరేషన్ ఆధ్వర్యాన 'విద్యా శాఖలో సిఆర్‌పిల పాత్ర' అంశంపై ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు నిర్వహించారు. సదస్సుకు చిరంజీవిరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యా శాఖలో పలు కార్యక్రమాల అమలులో ముఖ్య పాత్ర వహిస్తున్న సిఆర్‌పిలకు కూటమి ప్రభుత్వంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వేతనాలు పెంపుదలకు ప్రయత్నిస్తానన్నారు. గత ఐదేళ్ల క్రితం సిఆర్‌పిలకు అప్పటి టిడిపి ప్రభుత్వం అనేక అలవెన్స్‌లు ఇచ్చినట్లు వివరించారు. ఎపి సిఆర్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురువులు మాట్లాడుతూ, గత ప్రభుత్వం జాబ్ చార్ట్ లేకుండా చేసిందని విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సిఆర్‌పి లకు న్యాయం చేయాలని కోరారు. ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు తవిటినాయుడు మాట్లాడుతూ, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఫెడరేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు గౌరి, చిన్ని, చిరంజీవి, అనురాధ, లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

దంతరక్షణపై ఫ్లాష్ మాబ్

ప్రజాశక్తి-మధురవాడ : బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యత గురించి అవగాహన కలిగించడానికి గీతం దంతకళాశాల, ఆసుపత్రి వైద్యవిద్యార్థుల ఆధ్వర్యాన ఆదివారం స్థానిక వైఎంసిఏ వద్ద ఫ్లాష్ మాబ్, వీధినాటిక, ప్రసంగ కార్యక్రమాలను నిర్వహించారు. గీతం దంతకళాశాల, ఆసుపత్రి పీడియాట్రిక్స్, ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల దంత సంరక్షణ, ఆరోగ్యకరమైన పద్ధతులు, బ్రష్ చేసుకునే విధానంపై వైద్యులు ప్రసంగించారు. అందమైన, ఆరోగ్యకరమైన దంతాలు పూర్తి ఆరోగ్యానికి చాలా అవసరమైనవని, ముఖ్యంగా పిల్లలు తినడం, మాట్లాడటంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయని వారు తెలిపారు. బలహీనమైన దంతాలు, అపరిశుభ్రమైన నోరు కారణంగా రకరకాల ఇన్ఫెక్షన్లు, వ్యాధులు, క్యావిటీస్ తదితర సమస్యలు వస్తుంటాయని, దంతాలు ఊడిపోవడం, వాటి అరమరిక విషయంలోనూ సమస్యలు వచ్చే అవకాశాలున్నాయని వీటిపై పిల్లలకు అవగాహన అవసరమని తెలిపారు. నగరంలోని పాఠశాలల విద్యార్థుల దంత రక్షణ కోసం "శిశుగీతం" అనే కార్యక్రమాన్ని గత 15 రోజులుగా నిర్వహించామని, బాలలలో నోటి ఆరోగ్య ప్రాధాన్యతను పెంపొందించడానికి ఉద్దేశించబడిన ఈ కార్యక్రమంలో 20కి పైగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించినట్లు గీతం

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఆనందపురం : ఆనందపురం గ్రంథాలయంలో గ్రంథాలయ రంగంలో విశేషమైన కృషి చేసిన ప్రముఖులను స్మరించుకున్నారు. ముందుగా అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బంటుపల్లి సూర్యనారాయణ, శ్రీనాదు నారాయణరావు, గ్రంథాలయాధికారి బివిఎస్ అప్పారావు, కె.సత్యమూర్తి, స్కూల్ విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక కళా సాహితీ అధ్యక్షులు పి.రాజేంద్రప్రసాద్‌వర్మ, ఉపాధ్యాయులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : మాధవనగర్ రెసిడెన్సి అసోసియేషన్ ఆధ్వర్యాన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, చదరంగం, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎన్ఆర్ పార్కు అధ్యక్షులు అన్నెపు నారాయణరావు, పోర్టు పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారావు, కార్యదర్శి బుడుమూరు శ్రీను, వైస్ ప్రెసిడెంట్ వై.నూకరాజు, ఎస్ఎస్.రావు, ఎస్.అప్పారావు, ఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు కాకి పోలిరెడ్డి

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సుంకర చలపతిరావు, జికెవి.రాజు, టి.శ్రీరామ్మూర్తి, కె.సత్తిరాజు, బి.సత్యానందం, ఇపిఎస్.భాగ్యలక్ష్మి కవితలను వినిపించారు. జికెవి.రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవులను గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, టిడిపి నాయకులు కాకి పోలిరెడ్డి సత్కరించారు.

సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో వినోదవల్లరి కార్యక్రమం నిర్వహించారు. నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైటర్ అకాడమీ ఛైర్మన్ వివి.రమణమూర్తి, గ్రంథాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం జరిగింది. అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు జెట్టి ఎల్లమంద మాట్లాడుతూ, తెలుగు భాష గొప్పతనం వివరించారు.అనంతరం విద్యార్థులు చదివిన పద్యాలు, కవితలు సభికులను విశేషంగా ఆకర్షించాయి. విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు రామకృష్ణ, ఔత్సాహిక కవులు పరుశురాం, ప్రసాద్ కవితాగానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకరరావు, శ్రీరామరాజు, విశ్రాంత లైబ్రేరియన్లు జి.మురళీకృష్ణ, . త్రిమూర్తులు, లైబ్రేరి యన్ దమయంతి పాల్గొన్నారు.

గొలుగొండ:స్థానిక శాఖ గ్రంథాలయంలో బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమంను గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మ్యూజికల్ చైర్ గేమ్ నిర్వహించారు.

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్, ఖో ఖో వంటి పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. నక్కపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యమ కారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యమకారుల జీవిత చరిత్రను విద్యార్థులకు తెలియజేసారు.

మాడుగుల: గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.విద్యార్థులకు రీడింగ్ పోటీలు

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. జగన్, రమేష్ పాల్గొన్నారు.కస్పా జగన్నాథపురం శాఖ గ్రంథాలయంలో ఉద్యోగి శృతి ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాలకి నివాళులు అర్పించారు. చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కోటవురట్ల:శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. పుస్తక విలువలను వివరించారు. విద్యార్థులతో మ్యూజికల్ చైర్ ఆడించారు. ఉత్సాహంగా విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం: స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వి శిరీష ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులు బి. నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మరో టీచర్ అరసాడ సూర్యనారాయణరావు పాల్గొని తాను రాసిన కథ, కవితలు వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తెలుగు భాష,సాహిత్య ప్రక్రియలు,విశిష్టత పరిణామక్రమం, గ్రంథాలయ ఉద్యమ నేతలకు సంబంధించిన విషయాలతో కవి సమ్మేళనం నిర్వహించారు. అనంతరం అరసాడ సూర్యనారాయణరావు మాస్టారు ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. సత్యనారాయణ,కె. వీర్రాజు, వై. దత్తాత్రయ,ఎ. కేశవరావు, కె. మునిలి నాయుడు,బి. సుభాషిణి, ఎస్. కుమారి,విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుచ్చయ్యపేట శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి కృష్ణారావు, విద్యార్థులు పాల్గొన్నారు

కె. కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా ఆదివారం గ్రంథాలయాధికారి ఎం పద్మావతి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

2705 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామంలో ఉన్న బాలాజీ మోడరన్ రైస్ మిల్‌లో జిల్లా సివిల్ సప్లై అధికారి వి.భాస్కరరావు ఆధ్వర్యాన తనిఖీలు నిర్వహించారు. మిల్లులో అనధికారికంగా నిల్వ ఉంచిన పిడిఎస్ ఫోర్టిఫైడ్ బియ్యం 61 ప్లాస్టిక్ బ్యాగులను అధికారులు గుర్తించారు. 2705 కిలోల పిడిఎఫ్ రైస్‌ను స్వాధీనం చేసుకొని మిల్లు యజమానిపై 6-ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడిలో సివిల్ సప్లై అసిస్టెంట్ అధికారి కల్యాణి, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మత్స్యకారుల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన స్థానిక జోనల్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మత్స్యకార నాయకులు గంటా నూకరాజు మాట్లాడుతూ, సముద్రంపై తమకు పూర్తి హక్కులు ఉన్నాయని స్పష్టం చేశారు. తీరంలో ఇష్టారీతిన బార్ అండ్ రెస్టారెంట్లు, హోటళ్లు ఏర్పాటుతో ప్రధానంగా యువత పెడదారి పట్టే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు తీరం కోతకు గురయ్యే సందర్భంలో సహాయక చర్యలు చేపట్టేందుకు వెలసిన హోటళ్లు, రిసార్టులు అడ్డంకిగా మారే అవకాశం ఉందన్నారు. ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నరసింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు తదితరులు మాట్లాడుతూ, తీరంలో సిఆర్‌జెడ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి బర్రి కొండబాబు, మత్స్యకార నాయకులు వి.నరసింగరావు, గరగయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి యుపిహెచ్‌లో వైద్యం అందేనా?

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వాలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నా వాస్తవంగా కొన్ని ఆసుపత్రుల్లో సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పెందుర్తి యుపిహెచ్‌లో చిన్నచిన్న సమస్యలకు మాత్రమే తనిఖీలు చేస్తున్నారు. ఇంకేసమస్యలున్నా కెజిహెచ్‌కు వెళ్లాలని చెప్పేస్తున్నారు. గర్భిణులను అయితే అసలు చేర్పించుకోవడం లేదు. పెందుర్తి ప్రాంతం నుంచి గర్భిణులు కెజిహెచ్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 పంచాయతీలు, నాలుగు వార్డులకు సంబంధించిన ప్రజలకు ఉపయుక్తంగా ఉండేందుకు, తక్షణ వైద్యం అందేందుకు గత టిడిపి ప్రభుత్వం హయాంలో అప్పుడు మంత్రి ఉన్న బండారు సత్యనారాయణమూర్తి రూ.2 కోట్లతో ఆధునికీకరణ చేయించారు. కానీ ఆ లక్ష్యం నెరవేరడంలేదు. గర్భిణులు 15 పంచాయతీలు నాలుగు వార్డులు సంబంధించి ఎంతో ఆసుపత్రికి వస్తే కనీసం చూడకుండా కెజిహెచ్‌కు పంపించేస్తున్నారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం ఒక గర్భిణి ప్రసవం కోసం పెందుర్తి యుపిహెచ్‌కు వచ్చారు. ఆమెపై సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తూ కెజిహెచ్‌కు వెళ్లమని చెప్పారు. ఇంతలోనే నార్మల్ ప్రసవం జరిగింది. కెజిహెచ్‌కు వెళ్లమని చెప్పినా వినకపోవడంతో నర్సు ఇంజక్షన్ చేయకుండా అక్కడున్న ఆయాతో చేయించారు. దీంతో ఆ బాలింతకు వాపు వచ్చింది. నాలుగు రోజుల నుంచి పుట్టిన బేబీని కూడా పట్టించుకోకపోవడంతో ఆదివారం హాస్పటల్ నుంచి డి సిబ్బందికి చెప్పకుండా ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లిపోయారు. ప్రసవమైన మహిళను చూసేందుకు బంధువులు వచ్చి ఆమె ఎక్కడుందని ఆరా తీశారు. అప్పటి వరకు ఆమె ఆసుపత్రిలో లేదన్న విషయం కూడా సిబ్బంది గమనించలేదు. ఆసుపత్రిలో రోగుల పట్ల సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా ఉంటున్నారని బంధువులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు డాక్టర్ ఎల్‌బి కాలేజీలో బాల వికాస ఫౌండషన్ ఆధ్వర్యాన సత్కరించారు. ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జిఎస్ఎన్.రాజు, అతిథులుగా ఆచార్య బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ హాజరై ఉత్తమ ఉపాధ్యాయులు కెడివి.నరసింహారావు, పి.రాజారావు, పి.నాగేశ్వరరావు, కె.గంగాధరరావు, ఎస్.రాజేంద్రప్రసాద్, కెఎస్‌కె.నాగూర్‌ను సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథి జిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, కృషి, క్రమశిక్షణ, నిజాయతీకి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు గుర్తింపు అన్నారు. ఉపాధ్యాయులు మార్గదర్శకంగా మెలగాలని సూచించారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, ఉపధ్యాయులు కేవలం పుస్తకాల్లోని పాటాలే కాకుండా జనరల్ నాలెడ్జిని కూడా భోదించాలని సూచించారు. డిఇఒ ప్రేమకుమార్ ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. సమావేశానికి బాల వికాస్ ఫౌండషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు.

జూలో జంతువులను తిలకిస్తున్న సందర్శకులు

జూకు రూ.7.64 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను రికార్డు స్థాయిలో సందర్శకులు ఆదివారం సందర్శించారు. 10వేల మంది సందర్శించడం ద్వారా రూ.7.64 లక్షల ఆదాయం సమకూరింది. కంబాలకొండకు సందర్శకుల ద్వారా సుమారు రూ.65వేలు ఆదాయం సమకూరింది.

కంబాలకొండలో వన భోజనాల సందడి

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాలకొండ వన భోజనాలతో సందడిగా మారాయి. కార్తీకమాసం రెండో ఆదివారం కావడంతో కుటుంబాలు, స్నేహితులు, ఉద్యోగ సంఘాలు, కాలనీ సంఘాలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పెద్ద ఎత్తున రావడంతో పార్కులు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు.

ఆందోళన చేస్తున్న మాధవధార ప్రజలు, అయ్యప్ప భక్తులు

టోల్‌గేట్ వద్ద మాధవధార ప్రజల ఆందోళన

ప్రజాశక్తి- మాధవధార : మాధవధార టోల్‌గేట్ నిర్వాహకుల తీరును నిరసిస్తూ ఆ ప్రాంత ప్రజలు ఆదివారం టోల్‌గేటు వద్ద ఆందోళన చేశారు. మాల ధారణలో ఉన్న భక్తులకు టోల్‌గేట్ మినహాయింపు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మాధవధార కొండ మీదకు వెళ్తుంటే వాహనాలను అడ్డగించి బలవంతపు టోల్ వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రోజుకు మూడు పూటలా స్నానం చేసేందుకు వేల సంఖ్యలో అయ్యప్ప స్వాములు వస్తుంటారాని, అది కాకుండా ఎక్కడైనా రోడ్డుపైన మృతిచెందిన వారు ఎదురైతే ఇంటికి వెళ్లకుండా జలధారకు వచ్చి స్నానం చేయాల్సిన పరిస్థితి ఉందని, అలాంటప్పుడు రోజుకు నాలుగు సార్లు రూ.40 చొప్పున బలవంతపు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొండకు వెళ్లే దారికి అడ్డుగా నిలబడి వాహనాలు తాళాలు లాక్కొని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. ప్రశ్నిస్తే సింహాచలం కార్యనిర్వాహణ శాఖ అధికారిని అడగండి అని దురుసుగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నిర్వాహకునిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింహాచల దేవస్థానం అధికారులు ఇక్కడ పర్యటించి స్థానికులకు, భక్తులకు కార్తీక, మాఘ మాసంలో టోల్ వసూలు నిలిపివేయాలని, జలధార వద్ద కనీస ఏర్పాట్లు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, వాకర్స్, వివిధ స్వచ్ఛంద సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రక్తమిచ్చేవారు ప్రాణదాతలు

నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -గాజువాక : రక్తదాతలు ఆపదలో ఉన్న వారికి ప్రాణదాతలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. రక్తదానంపై యువత అవగాహన పెంచుకుని ముందుకు రావాలని కోరారు. గాజువాకలో మనోజ్ కుమార్, లావణ్య దంపతుల కుమార్తె ప్రేరణ రెండవ పుట్టినరోజు సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటుచేశారు. దీనికి ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ హాజరై మాట్లాడారు. తలసేమియా వ్యాధి ప్రాణాంతకమైనదని, దీనికి అమెరికా వంటి దేశాలలో జినోమ్ పద్ధతి ద్వారా చికిత్స అందు బాటులోకి వచ్చిందని చెప్పారు. తాను పోలీస్ అధికారిగా కాకుండా వైద్యునిగా కూడా కొన్ని సూచనలు చేస్తున్నానంటూ తలసేమియా వ్యాధి గ్రస్తుల కుటుంబ సభ్యులకు విలువైన సలహాలు అందించారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను అభినందించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, జన్మదిన వేడుకను పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ పరంగా వైద్య సహాయం అందుతుందన్నారు. మరింత మెరుగైన, ఆధునిక వైద్య సహాయం అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

నిర్వాహకులు మనోజ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా తలసేమియా బాధితుల కోసం ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం చేసినవారికి సర్టిఫికెట్‌తో పాటు రూ.రెండు లక్షల ఇన్స్యూరెన్స్ కూడా చేయిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు గొడబ రాంబాబు, ధవళేశ్వరపు రవికుమార్ మాట్లాడుతూ, ఇకపై రక్తదాన శిబిరాలు వంటి సామాజిక కార్యక్రమాల్లోనూ తాము భాగస్వాములం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపి త్రినాథ్, సిఐ పార్థసారధి, సీనియర్ న్యాయవాదులు వెన్నెల ఈశ్వరరావు, రాంబాబు, వైసిపి నాయకులు దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఉరుకూటి చందు, స్థానిక టిడిపి నాయకులు మహ్మద్ రఫీ, గోమాడ వాసు, గొడబ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదాతలతో నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జర్నలిస్టుల సమస్యలను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని కోరుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు సీతంపేటలోని ఆయన నివాసంలో కలిశారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా అసెంబ్లీలో సమస్యలను చర్చించి ప్రత్యేక నిధులు కేటాయించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేసి డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం జర్నలిస్టులకు 4 సెంట్లు ఇళ్ల స్థలాలు ఉచితంగా కేటాయించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రిటైర్డ్ జర్నలిస్టులకు రూ.10వేల పెన్షన్, కోవిడ్‌తో చనిపోయిన జర్నలిస్టులకు రూ.5లక్షల పరిహారం, ప్రెస్ అక్రిడిటేషన్ల పెంపు, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీల ఏర్పాటు, ప్రమాద బీమా పునరుద్ధరణ, స్థానిక పత్రికలకు చేయూత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు నగరంలో అందుబాటులో లేకపోవడంతో ఆయనతో ఫోన్‌లో మాట్లాడి వినతిపత్రాన్ని పంపారు. ఈ కార్యక్రమంలో పి.సత్యనారాయణ, కొయిలాడ పరశురాం, కెఎం.కీర్తన్, చందుయాదవ్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సందడిగా ప్రజాశక్తి కుటుంబం పిక్నిక్

బహుమతులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజాశక్తి కుటుంబ సభ్యుల పిక్నిక్ నగరంలోని కంబాలకొండ ప్రాంతంలో ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఆటపాటలతో అంతా సందడి చేశారు. చిన్నారుల డ్యాన్స్‌లు ఆకట్టుకున్నాయి. పాటలు, పద్యాలు వినసొంపుగా సాగాయి. లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి ఆటలతో ఆద్యంతం సందడి నెలకొంది. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి అతిథులుగా హాజరైన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ పూర్వ మేనేజర్ సుధాకర్, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వర రావు బహుమతులు అందజేశారు. లక్కీడిప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వనభోజన మహోత్సవాన్ని ఉద్దేశించి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ వన భోజనాలు ఐక్యతకు ప్రతీక అన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో పరస్పర సంబంధాలు పెరుగుతాయని చెప్పారు. ఒకరి ఆలోచనలను మరొకరితో పంచుకునే వీలు కలుగుతుందన్నారు. ఉద్యోగ, వృత్తి ఒత్తిళ్ల నేపథ్యంలో ఇటువంటి కార్యక్రమాలు కాసింత ఉపశమనాన్ని ఇస్తాయన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ప్రజాశక్తి కుటుంబీకులంతా ఇలా ఒకేచోట కలుసుకోవడం ఆనందాన్నిచ్చే విషయమన్నారు. కార్యక్రమాన్ని ఎన్.మధు, రాజేశ్వర్‌రెడ్డి సమన్వయపరిచారు.

లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న ప్రజాశక్తి కుటుంబీకులు

డ్యాన్స్ చేస్తున్న చిన్నారి

తనిఖీల్లో నిర్లక్ష్యం వల్లే పరిశ్రమల్లో ప్రమాదాలు

- కదలని అధికారులపై కానరాని చర్యలు
- వందరోజులైనా బహిర్గతం కాని హైపర్ కమిటీ నివేదిక
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి : ఫార్మా, పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నా వాటి నియంత్రణకు, తనిఖీల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం సిఐటియు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని ఫార్మా, కెమికల్ తదితర పరిశ్రమల్లో సెంట్రల్ ఇన్స్పెక్షన్ సిస్టం ఆధారంగా తనిఖీలు నిర్వహించకపోవడం, భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోవడం వల్లే ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు .ఆగస్టు 21న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17మంది మృత్యువాత పడడం, 39 మంది గాయపడడం, ల మరుసటి రోజే పరవాడ ఫార్మసిటీలోని సెనర్జిన్ ఫార్మా ప్రమాదంలో నలుగురు మృతి ఘటన జరిగి వంద రోజులు కావస్తున్నా దీనిపై ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ ఏం నివేదిక ఇచ్చిందో నేటికీ బహిర్గతం కాలేదన్నారు. గతేడాది డిసెంబర్ నెలలోనే పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాలని డిప్యూటీ ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్‌కు ఆదేశాలు వచ్చినా, వారి నిర్లక్ష్యం వల్లే ఇంతటి భారీ ప్రాణ నష్టం జరిగిందని మండిపడ్డారు.. పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యల్లో ఉదాసీనతే దీనికి కారణమని, దీనిపై సమాధానం చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ బిజినెస్ అంటూ చెబుతున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వం, దీనిలో కార్మికుల ప్రాణాలకు రక్షణ, భద్రత, ఉపాధి గ్యారంటీ కల్పిస్తూ, స్వేచ్ఛగా పని చేసుకునే వాతావరణాన్ని కల్పించాలని, అప్పుడే పారిశ్రామికాభివృద్ధి పురోగమిస్తుందన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు భద్రతపై ఖర్చు వృథాగా భావించడం వల్లే వరుస ప్రమాదాలకు కారణమని విమర్శించారు.

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సెంట్రల్ ఇన్స్పెక్షన్ సిస్టం ఆదేశానుసారం ఎసెన్షియా, సెనర్జిన్ కంపెనీలలో తనిఖీలు జరిగి ఉంటే 21 మంది ప్రాణాలు పోయేవి కావన్నారు. పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు రెగ్యులర్‌గా నిర్వహించాలని, వాటినివేదికలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ రిపోర్ట్ ను 100 రోజులైనా ఇప్పటికీ బయట పెట్టకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు పాల్గొన్నారు

పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే ప్రకటించాలి

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి-అనకాపల్లి : పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. ఆదివారం అనకాపల్లి సిఐటియు ఆఫీసులో యూనియన్ జిల్లా సమావేశంలో మాట్లాడుతూ గత పిఆర్‌సి కాలపరిమితి ముగిసి, 16 నెలలు కావస్తున్నా కొత్త పిఆర్‌సి ప్రకటించలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం పిఆర్‌సి కమిషనర్‌గా డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ను నియమించినా, ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి ఐఆర్ ప్రకటించకుండా కాలయాపన చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, పిఆర్‌సిపై తక్షణమే ప్రకటన చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ ఆర్థిక బకాయిలు రూ. 20 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, జిఐఎస్, సంపాదిత సెలవుల నగదు, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను క్లియర్ చేయాలని కోరారు.

కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నెల్లి సుబ్బారావు, అధ్యక్షులు వి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు సూర్య ప్రకాష్, పొలిమేర చంద్ర రావు, రమేష్ రావు, చైతన్య శీల ,కళింగ సతీష్, శేషు కుమార్ రాష్ట్ర కౌన్సిలర్లు ఎల్లయ్య బాబు, ఎంవి అప్పారావు, సీనియర్ నాయకులు వెంకటరావు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన ఆటల పోటీలు

ఐద్వా ఆధ్వర్యాన ఆటల పోటీలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బాలల దినోత్సవం సందర్భంగా మోసాయిపేట గ్రామంలో ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, దేశ తొలి ప్రధానమంత్రిగా చాచా నెహ్రూ భారతదేశ పారిశ్రామిక, వ్యవసాయ, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆటలు పోటీల్లో విజేతలకు గ్రామసర్పంచ్ పంచదార్ల పైడిరాజు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా మండల కన్వీనర్ ఆర్.లక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము, చొప్ప. అప్పలనాయుడు, శర్మ, కంటెంపూడి సతీష్, ఎస్.పార్వతి, సిరి, వనజ, దుర్గ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించండి

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిత్యావసరాల ధరలను తగ్గించాలని కోరుతూ ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలను పంచుతూ గవరపాలెం, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. గవరపాలెంలో బుట్టలు అల్లే కార్మికులను కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరాం మాట్లాడుతూ, రోజుకు వెయ్యి మంది రోగులు వైద్యానికి వచ్చే ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో సరైన మౌలిక వసతులు, మందులు, సరిపడా వైద్యులు, వైద్య పరికరాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యాధి నిర్ధారణకు . కనీసం రక్త పరీక్షల పరికరాలు లేకపోవడం అన్యాయమని, దీంతో రోగులకు బయట ల్యాబ్‌లకు వెళ్లి సొంత సొమ్ములతో పరీక్షలు చేయించుకుంటున్నారన్నారు. ఈ కారణంగా హాస్పిటల్ చుట్టూ అనేక ప్రైవేట్ ల్యాబ్‌లు పుట్టగొడుగులా పుట్టు కొస్తున్నాయన్నారు. దీనిపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రచారంలో కమిటీ సభ్యులు బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్య బాబు, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి-దేవరాపల్లి : కార్తీక మాసం పురస్కరించుకొని దేవరాపల్లి మండలం ఎం.అలమండ గ్రామంలో ఎర్ణమ్మ తల్లి గుడి వద్ద ఆదివారం కార్తీకమాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే గౌరీ రెడ్డి రామానాయుడు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పోతల పాత్రనాయుడు, గొర్లె గోవింద, తాడి చంటి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీని నిలుపుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వెంకన్న

ఎరుకునాయుడు మెట్ట క్వారీని చూపుతున్న వెంకన్న

ప్రజాశక్తి- దేవరాపల్లి :మండలంలోని మారేపల్లి పంచాయతీ ఎరుకునాయుడు మెట్టవద్ద నల్లరాయి అక్రమ క్వారీని వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న డిమాండ్ చేసారు. కొండను గుళ్ళ చేసిన మైనింగ్ మాఫియాపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివారం అయిన క్వారీ తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని వాడపల్లి, చినగంగవరం, మారేపల్లి ప్రాంతంలో ఎటువంటి అనుమతులు లేకుండా నల్లరాయి క్వారీలను తవ్వుతూ, కొండల రూపురేఖలను మార్చేస్తున్నా, మామ్మూళ్ల మత్తుకు కక్కుర్తిపడిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మాడుగుల మండలం అవురువాడ పంచాయతీలో సీతలబంధ గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడి కిముడు రాము అనే యువకుడు శనివారం మరణిస్తే ఇప్పటివరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. అక్రమ క్వారీలతో కొండలన్నీ మాయమవ్వడం తోపాటు ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా అధికారులు చోద్యం చూడడం గర్హనీయమన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఇక మండల కార్యాలయాల్లోనూ గ్రీవెన్స్

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజలకు ఇబ్బందులు లేకుండా, వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఇక ప్రతిసోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల కేంద్రాల్లోని తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటించారు.సమస్యలపై అక్కడ కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పాలనను .ప్రజలకు మరింత చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా మండల,పురపాలక స్థాయిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వం అదేశించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు

26న నిరసనను జయప్రదం చేయండి

- రైతులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలకు సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్స్ పిలుపు

అనకాపల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న కర్రి అప్పారావు

ప్రజాశక్తి- అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు దేశవ్యాప్త నిరసనలో భాగంగా ఈనెల 26న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే ఆందోళనను జయప్రదం చేయాలని ఆయా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో రౌండ్ టేబుల్ సమావేశంలో నిరసనపై సమీక్ష, గ్రామీణ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలపై చర్చించారు. నిరసనలో రైతులు, కార్మికులు, కూలీలు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రధాని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, 44 కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్సును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఎస్‌కెఎం టియు జెఎసి నాయకులు కర్రి అప్పారావు, గాడి బాలు, వైన్ భద్రం, ఆర్ శంకర్రావు, కోరుబిల్లి శంకర్రావు, రంగారావు, శివ పాల్గొన్నారు.

రాంబిల్లి సిఐటియు సమావేశంలో మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న దేశవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద రైతు, కార్మికసంఘాలు చేపట్టే నిరసనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు కోరారు. ఆదివారం స్థానిక తుఫాన్ బిల్డింగ్ వద్ద బద్ది భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, వివిధ రంగాల కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చందక రామకృష్ణ, వివిధ రంగాల నాయకులు పిల్లి మంగ, లక్ష్మి, కొండయ్య, అప్పారావు, కర్రి శ్రీను, నాగేష్, పి వరహాలరావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి

● చోడవరం, బుచ్చయ్యపేట మండల సర్వసభ్య సమావేశాల్లో ఎమ్మెల్యే రాజు

చోడవరం మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : పార్టీలకతీతంగా ఎమ్మెల్యే కోటా నిధులు కేటాయించి, గ్రామాలను అభివృద్ధి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎంఎస్ రాజు అన్నారు. ఆదివారం ఎంపిపి గాడి కాసు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలకు ఎమ్మెల్యే కోటా నిధులు మంజూరుచేస్తానని, పంచాయతీ నిధులను ఇతర అవసరాలకు వాడుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగాఅందరికీ సమానంగా నిధులు అందజేస్తామన్నారు. విద్యుత్ ,తాగునీటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నందున ఆయా శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమీక్షిస్తామన్నారు. చోడవరం గురకులంలో విద్యార్థులను కలిసేందుకు వెళుతున్న తల్లిదండ్రుల పట్ల అక్కడి సిబ్బంది అనుచితంగా వ్యవహరిస్తున్నారని పలుమార్లు మండల సభలో లేవనత్తినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఎంఇఒ సింహాచలాన్ని చోడవరం ఎంపిటిసి గూనూరు పద్మ ప్రశ్నించారు. దీనివల్లే చోడవరం విద్యార్థులు స్థానికంగా ఉన్న పాఠశాలకు కాకుండా లక్ష్మీపురం హైస్కూల్‌కు పోతున్నారని అంకుపాలెం సర్పంచ్ నాగులపల్లి రాంబాబు ప్రశ్నించారు. ప్రతిపనికి డబ్బులు వసూలు చేయడమే తప్ప, సమస్యలను సరిగా పరిష్కరించడం లేదని విద్యుత్‌శాఖ సిబ్బందిని పలువురు సభ్యులు నిలదీశారు. తమ పంచాయతీల్లో జరుగుతున్న కార్యకలాపాలు సచివాలయం ఉద్యోగులు తెలియపరచలేదని జొన్న వరం సర్పంచ్ సన్యాసిరావు, గౌరీపట్నం ఎంపీటీసీ మంగరాజు, తిమ్మలపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. చోడవరం స్కూల్ వద్ద పానీపూరి అమ్మకాలు జరుపుతున్న చోట విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నారని పలువురు సభ్యులు ప్రస్తావించారు. ఖరీఫ్‌లో కల్తీ విత్తనాలు సరఫరా చేశారని, ఇపుడు రైతులకు వ్యవసాయ సూచనలు ఇచ్చేందుకు ఆశాఖ అధికారులు కనీసం గ్రామాల్లో పర్యటించడం లేదని పలువురు ప్రశ్నించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అంబటి రామారావు, ఎంపిడిఒ జి ఆంజనేయులు, ఇఒపిఆర్‌డి మహేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించండి

బుచ్చయ్యపేట : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలలో నిబంధనల మేరకు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అధికారులకు సూచించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపిపి దాకారపు నాగేశ్వరీదేవి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎంపిటిసిలు, సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. నీటిపారుదల, ఉపాధిహామీ విద్యుత్తు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సర్పంచులు, ఎంపిటిసిలుఅడిగిన ప్రశ్నలకు ఆయా శాఖలఅధికారులు వివరణ ఇచ్చారు. సీతయ్యపేట, వడ్డాది, పోలేపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యేను సభ్యులు కోరారు

దీనిపై ఎమ్మెల్యే రాజు స్పందిస్తూ, ఆయాశాఖల జిల్లా అధికారులతో మాట్లాడి, సమస్యపై సమగ్ర నివేదిక తయారుచేయించి సత్వర చర్యలు చేపడతానని హామీనిచ్చారు. బిఎన్ రోడ్డు, వంతెనలనిర్మాణంపై ఇప్పటికే అసెంబ్లీలో ప్రస్తావించానని, సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొండా రాంబాబు, ఎంపిడిఒ విజయలక్ష్మి, తహశీల్దార్ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

యువత, విద్యార్థులకు ఎమ్మెల్యే సుందరపు పిలుపు

2కె రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రానున్న రోజులలో రాష్ట్రంలో యువతకు బంగారు భవిష్యత్తు వస్తుందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చెప్పారు. ఆదివారం ప్రశాంతి పాలిటెక్నిక్ ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన 2కె, 5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ, యువత దురలవాట్లకు బానిసలు కాకుండా చక్కగా చదువుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని, మెరుగైన విద్యా ప్రమాణాలు కలిగిన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన ప్రశాంతి పాలిటెక్నిక్ విద్యాసంస్థల చైర్మన్ ధర్మారెడ్డి ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో సిఐ నమ్మి గణేష్, ఎస్ఐ సుధాకర్, జనసేన మండల అధ్యక్షులు ఇ.శ్రీరామదాసు, ద్వారపురెడ్డి బాబ్జి, జనపరెడ్డి నర్సింగరావు, డాక్టర్ కిషోర్, కె.విమలానాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని కరక గ్రామంలో జగనన్న కాలనీకి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకుని, అందులో సరుగుడు మొక్కలు సాగు చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై అధికారులు పరిశీలన జరపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పేద ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమిని సేకరించి లేఅవుట్ తయారు చేశారు. గ్రామానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలిచ్చారు. అయితే ఊరికి దూరంగా ఉందన్న కారణంతో అక్కడ ఇల్లు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. దీంతో ఖాళీగా ఉన్న స్థలాన్ని స్థానికుడైన యన్నంశెట్టి దేవుడు అనే వ్యక్తి ఆక్రమించుకొని సరుగుడు మొక్కలు నాటాడని గ్రామస్తులు అంటున్నారు. ఇళ్ల స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గాయపడిన జనసేన నేతకు పరామర్శ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఇటీవలే క్వారీ ప్రమాదంలో తీవ్రగాయాల పాలై అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బవులవాడకు చెందిన జనసేన నాయకుడు జంపా గణేష్‌ను అనకాపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ ఆదివారం పరామర్శించారు. గణేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని ఆసుపత్రి సిబ్బందిని కోరారు.

సామూహిక శ్రమదానం

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్వచ్ఛతా హీ సేవాకార్యక్రమంలో భాగంగా ఆదివారం రావులమ్మ బిల్డింగ్ కనస్ట్రక్షన్ భవన నిర్మాణ కార్మికులు నిర్వాహకులు కన్నూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక శ్రమదానం నిర్వహించారు. ఈనెల 23న సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని, రామ సత్యసాయి ఆలయ ప్రాంగణాన్ని, పరిసరాలను శుభ్రం చేశారు.సత్యసాయి సంస్థల జిల్లా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు ఉపకరణాలు అందజేశారు.

రామ్మూర్తి నాయుడుకు ఘననివాళి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సిఎం చంద్రబాబు తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు అకాల మృతికి మండల టిడిపి నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో రామ్మూర్తి నాయుడు చిత్రపటానికి రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ బద్ది వెంకటరమణ, ఎంపిటిసి మేరుగు అప్పలనాయుడు, లాలం సురేష్, లాలం సత్తిబాబు, లాలం ప్రసాద్, ఆడారి సాంబశివ రావు, కోసూరి ఈశ్వరరావు, గుర్రం గోవింద్, కోవిరి బంగారయ్య, ఉల్లింగల సంతోష్, రౌతు నాగ అప్పారావు పాల్గొన్నారు

చిత్రకళ పురస్కార గ్రహీతకు అభినందన

పురస్కారాన్ని అందించిన సూర్యనారాయణ వేసిన చిత్రం

ప్రజాశక్తి -చోడవరం : చిత్ర కళారంగానికి చోడవరం చిత్ర కళానికేతన్ వ్యవస్థాపకులు, చిత్రకారుడు బొడ్డేటి సూర్యనారాయణ చేస్తున్న సేవలకు గుర్తింపుగా చెన్నైలోని శ్రీదర్శిని కలైకూడం ఘనంగా సత్కరించింది. చిత్రకళలో శిక్షణ ఇస్తున్న శ్రీదర్శిని కలైకూడం 20వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం జాతీయ చిత్రకళా పురస్కారాలను ప్రదానం చేశారు. చెన్నై టి.నగర్ జిఎన్.చెట్టి రోడ్డులోని వాణి మహల్ ప్రాంగణంలో ఆంధ్రా, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా శ్రీదర్శిని కలైకూడం జాతీయ స్థాయిలో చిత్రకారులకు నిర్వహించిన పోటీలు, చిత్ర ప్రదర్శనకు సూర్యనారాయణ వేసిన 'చేపల వేటకు వెళ్లేందుకు సముద్రంలోకి పడవను నెడుతున్న జాలరులు' చిత్రం కళాభిమానుల ప్రశంసలందుకుంది. తమిళనాడు టి.నగర్ ఎమ్మెల్యే జె.కరుణానిధి ముఖ్య అతిథిగా హాజరై చిత్రకారులను సత్కరించి, పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జాలరుల చిత్రానికిగాను సూర్యనారాయణకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేశారు. ఆ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, శ్రీ దర్శిని కలైకూడం వ్యవస్థాపకులు డి.ధర్మలింగం చిత్రకళకు ఎంతో సేవ చేస్తున్నారని, వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులను ప్రోత్సహిస్తూ కళకు భాషాభేదం లేదని చాటి చెబుతున్నారని కొనియాడారు. చెన్నైలో సత్కారం పొందిన సూర్యనారాయణకు ప్రేమ సమాజం రాజు, ఒఆర్ఆర్‌సి ప్రసాద్, కొండలరావు, ప్రకాష్, కృష్ణ, కన్నయ్యశెట్టి, పలువురు చిత్రకారులు అభినందనలు తెలిపారు.

బంగారు పతక విజేతకు సత్కారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : శ్రీలంకలో అంతర్జాతీయ స్థాయిలో 14 దేశాలకు చెందిన 200 జట్లు పాల్గొన్న పోటీలలో విజయం సాధించి, బంగారు పతకం కైవసం చేసుకున్న విశాఖ నేవీ జట్టు సభ్యుడైన నునపర్తి గ్రామానికి చెందిన పెదపాటి కామేష్‌ను ఆదివారం శ్రీ రామ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శ్రీలంకలో నిర్వహించిన పోటీలలో యుద్ధ నౌకల్లో పని భారం, ఖర్చు తగ్గించే విధంగా డాక్‌యార్డుకు చెందిన ఉద్యోగులు ముఖ్యమైన పరికరాన్ని తయారుచేసి వినియోగించారు. ఈ నైపుణ్యత దేశవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో గుర్తింపు సాధించడంతోపాటు, ప్రపంచ స్థాయిలో శ్రీలంకలో మూడు రోజులపాటు జరిగిన ప్రదర్శనలలో విశాఖ నేవీ టీం గోల్డ్ మెడల్ సాధించింది. ఆ జట్టులో సభ్యుడైన కామేష్‌ను శ్రీ రామ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఆర్‌బివి నగేష్ దుశ్శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు, రెడ్డి శ్రీను, కన్నూరు ఎర్నాయుడు, రెడ్డి అప్పారావు, తొడపు వరం బాబు, రెడ్డి ఎరుకునాయుడు మాసవరపు తమ్ము నాయుడు, కర్రి రాజేష్ పాల్గొన్నారు.

వరి పైర్ల రక్షణకు అన్నదాతల అగచాట్లు

పైర్లకు సాగునీరిచ్చేందుకు పైపులు వేస్తున్న రైతు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: ఖరీఫ్ సీజన్ చివరి దశలో వరుణుడు ముఖం చాటేయడంతో పొట్ట,కంకి దశలో ఉన్న వరిపైర్లు రక్షించుకోవడానికి అన్నదాతలు నానా అగచాట్లు పడుతున్నారు. కొన్నాళ్లుగా వర్షాలు ఎత్తిపెట్టడంతో సాగునీటి చెరువులు ఇంకిపోయాయి. ఇక వర్షాధారంగా సాగుచేసిన పంటపొలాల్లో పొట్టదశలో ఉన్న పైర్లు సాగునీరు లేక కొనవాడిపోతుండడంతో రైతన్నలు కలవరపడుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి రేయింబవళ్లు కష్టపడుతున్నారు. అందుబాటులో ఉన్న వ్యవసాయ బావులు, చెరువుల్లోని నీటిని పైపులు వేసి మోటార్లు ద్వారా అందిస్తున్నారు.ఆఖరి దశలో ఆశాజనంగా ఉన్న పైర్లు సాగునీటి కొరతతో పాడౌతుండడంతో రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ

ప్రజాశక్తి -మునగపాక: వైసిపి బలోపేతానికి పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు.ఆదివారం ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ప్రసాద్‌ను పార్టీ శ్రేణులు అభినందించి, సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవి అప్పగించిన జగన్మోహన్‌రెడ్డికి, సిఫార్సు చేసిన ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ విజయ సాయి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమం ఆడారి గణపతి అచ్చం నాయుడు, దిమ్మల అప్పారావు, మద్దాల వీరు నాయుడు, సూరిశెట్టి రాము, నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల నూకరాజు, కోనపల్లి రామ్మోహనరావు, శరగడం జగన్నాథ రావు, దాసరి అప్పారావు దొడ్డి వర, కాండ్రేగుల జగన్, పెతకంశెట్టి రామ జోగినాయుడు, ఎస్ రమణమ్మ, ఆడారి కాశి పాల్గొన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్లకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని భోగలింగేశ్వరస్వామి దేవస్థానం, సంతోషిమాత దేవస్థానం, సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం, సత్యనారాయణపురం హేమగిరి దేవస్థానం, వేల్పులవీధి కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీల ప్రమాణ స్వీకార ఆదివారం ఘనంగా జరిగింది. అనకాపల్లి జనసేన ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, ఎపియుఎఫ్‌ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు సమక్షంలో జరిగిన ప్రమాణస్వీకారం చేశారు.

ఆలయ కమిటీ చైర్మన్లను సత్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజలపై భారాలు తగ్గించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.ప్రభావతి

ప్రజాశక్తి- చీడికాడ:మండలంలోని కోణం పంచాయతీ కొండ్ల కొత్తూరు గ్రామంలో సిపిఎం మండల మహాసభ జరిగింది. ముందుగా సిపిఎం పతాకాన్ని రంగసింగి పెద్దన్నదొర ఆవిష్కరించారు.అనంతరం జరిగిన మహా సభ రమణ అధ్యక్షతన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ప్రభావతి మాట్లాడుతూ, ప్రస్తుతం పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. యువతకు ఉద్యోగాలు రాక పోవడం, మరోవైపు ఉన్న కంపెనీలు మూతపడుతుండటంతో నిరుద్యోగం పెరుగుతుందన్నారు. బిజెపి ప్రభుత్వం సామాన్యులకు రాయితీలు కల్పించాల్సిందే పోయి పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తుందని విమర్శించారు.సామాన్యులపై భారాలు మోపుతున్నారన్నారు.మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అమ్మడం చేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో రైతాంగం పరిశ్రమలు వస్తే ఉపాధి కలుగుతుందని భవిష్యత్తు బాగుంటుందని భూములను ప్రభుత్వానికి ఇచ్చారని, ఉపాధి కల్పించకపోగా వ్యాపారాలు చేసుకుంటున్నారన్నారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు ఎక్కడా అమలు కాలేదన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, 11 వేల కోట్ల విద్యుత్ చార్జీల బారాలు ప్రజలపై వేశారన్నారు. ఉచిత ఇసుక ఎక్కడా అమలు కాలేదన్నారు. మహిళలపై విపరీతంగా దాడులు పెరిగాయన్నారు. రైతులకుగిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారని తెలిపారు.సీపీఎం మండల కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్ రావు, మండల నాయకులు ఎం.రమణ, సిహెచ్ శ్రీనివాసరావు, కన్నబాబు, ఈశ్వరరావు, చిన్నబ్బాయి, రాము తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రభావతి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థినులు ఆటపాటలతో అలరించారు. ఆదివారం శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్పైసెస్ (శ్రీ ప్రకాష్ ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్) ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆట పాటలతో అందరినీ అలరించారు.విద్యార్థినులు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఒకరోజు పూర్తిగా ఆటపాటలతో గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ భానుమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దిబ్బిడిలో సభ్యత్వాన్ని అందజేస్తున్న శ్రీనివాసరావు

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని దిబ్బిడి గ్రామంలో ఆదివారం మాజీ ఎంపిటిసి జి.శ్రీనివాసరావు టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా రూ.100 రుసుముతో టిడిపి సభ్యత్వం తీసుకుంటే కలిగే తక్షణ ప్రయోజనాలతోపాటు, పార్టీ సభ్యునిగా వారికున్న గౌరవం, మున్ముందు కలిగే లాభాలను వివరించగా, పలువురు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పెదిరెడ్ల రాజు, ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు, గొన్నాబత్తుల శ్రీనివాసరావు, ముమ్మిన నాగరాజు, సానపతి శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు సేనాపతి మణికంఠ, స్కూల్ కమిటీ మాజీ చైర్మన్ పెదరెడ్ల గంగరాజు, తాటికొండ గణేష్, వియ్యపు రామారావు తాండ్రంగి పవన్, సింహాద్రి సూర్యనారాయణ గంటా మాణిక్యం, చిన్ని అచ్చం నాయుడు పాల్గొన్నారు

రోలుగుంట:మండలంలో దిబ్బలపాలెం గ్రామంలో సర్పంచ్ ఆర్.రమణాజీ ఆద్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా చేపడుతున్నారు. అనంతరం సభ్యత్వ నమోదు చేయించుకున్న వారికి సభ్యత్వంతో కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి ఇన్‌చార్జ్ బంటు రాజు, మాజీ సర్పంచ్ సుందరపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యాన ఆదివారం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవ్ కుమార్, వి.సత్యారావు పాల్గొన్నారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డులోని పలు కాలనీల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యాన సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మొల్లి లక్ష్మణరావు, వాండ్రాశి అప్పలరాజు, నమ్మి శ్రీను, నాగోతి సత్యనారాయణ, ఈగల రవి, ఓలేటి శ్రావణ్, లక్ష్మణరావు, సునీత పాల్గొన్నారు.

రోలుగుంటలో నమోదు చేపడుతున్న నాయకులు

ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో అవురువాడ పంచాయతీ శివారు సీతబందల నేచరల్ స్టోన్స్ గ్రానైట్ క్వారిలో మృతి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ట్రాక్టర్ బోల్తా పడి మరణించిన రాముకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. మృతుని తల్లి, తండ్రి రాజమండ్రిలో కూలి పని నిమిత్తం జీవనోపాధి సాగిస్తున్నారన్నారు.ఆ కుటుంబానికి పరిహారం చెల్లించకపోతే క్వారీ యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేసారు. మాడుగుల, రావికమతం మండలాల్లో క్వారీ యజమానులు ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా యదేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. ఇప్పటికే చాలా మంది గిరిజనులు క్వారిల్లో ప్రమాదవశాత్తు మరణించినప్పటికీ క్వారీ యజమానులు అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులతో మంతనాలు జరిపి, ఏ ఒక్కరకి పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. క్వారీ తవ్వకాల్లో ఇష్టాను సారంగా వ్యహరిస్తున్నారని తెలిపారు.

మాట్లాడుతున్న నరసింహమూర్తి

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో కింతలి గ్రామంలో ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలల్లో ఆదివారం అంబేద్కర్ విగ్రహాలను కింతలి గ్రామ అభివృద్ధి కమిటీ సొంత నిధులుతో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు మాల మహానాడు నాయకులు సహాయ సహకారాల అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మై చర్ల సన్యాసిరావు, ఉపసర్పంచ్ అప్పాన నారాయణ రావు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబర్ మరువాడ ఈశ్వర్‌రావు, ఎంఎం దాసు, మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు కుదర నాగేశ్వరావు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సియ్యాదిరి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పాము సూర్యారావు, పెట్ల ఈశ్వరరావు, నాయకులు వేచలపు సహదేవుడు, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఉపమాకలో ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక లో ప్రగడ వారి కుటుంబీకులు సందడి చేసారు. కార్తీక మాసం పురస్కరించుకొని వన భోజనం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రగడ కుటుంబీకులంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపమాకలో కొబ్బరి తోటలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించగా పలు ప్రాంతాల నుంచి ప్రగడ కుటుంబీకులు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, ఆర్గనైజర్లు ప్రగడ దుర్గాప్రసాద్, చక్ర రావు, చక్రి, జగదీశ్వరరావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ప్రగడను సన్మానిస్తున్న నాయకులు

మొక్కలను పరిరక్షించాలి

ప్రజాశక్తి -రావికమతం:మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకొనే బాధ్యత గ్రామ ప్రజల పైనే వుందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్యకుమారి తెలిపారు. . మండలంలో కవగుంట గ్రామ కంఠం పరిధిలో ఖాళీ ప్రదేశాలలో ఇటీవల కొబ్బరి మొక్కలను నాటారు. వాటి చుట్టూ ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇవి పెరిగి పెద్దవైతే గ్రామ పంచాయతీకి ఆదాయం వనరుగా తయారవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నివారణకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటి పర్యావరణ, కాలుష్య నియంత్రణకు సహకరించాలని కోరారు.

కైలాసపట్నంలో అపారిశుధ్యం

-రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

-పలుచోట్ల చెత్తాచెదారం

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కైలాసపట్నం గ్రామం అపారిశుధ్యానికి అడ్డాగా దర్శనమిస్తుంది. ఆనాటి టిడిపి ప్రభుత్వంలో మండలంలో తొలిసారిగా మొదలుపెట్టిన సంపద కేంద్రం నేటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తుంది. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా డంపింగ్ యార్డ్ లే దర్శనమిస్తున్నాయి. కైలాసపట్నం నుండి రాజపేట వెళ్లే రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే రహదారిని అనుకొని వరహానది వద్ద డంపింగ్ యార్డ్ గా మార్చేశారు. దీంతో ఆ రోడ్డున వెళ్లే ప్రజలు దుర్గంధంతో అవస్థలు పడుతున్నారు.ఇదే పరిస్థితి 33 కెవి విద్యుత్ స్టేషన్ సమీపాన కూడా దర్శనమిస్తోంది. ప్రతి శనివారం స్వచ్ఛతే హీ సేవా కార్యక్రమం అంటూ అధికారులు హడావిడి చేస్తున్నారు. చిత్తశుద్ధితో పని చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు చెప్పిన పెడచెవిన పెడుతున్నారని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు సమీపాన చెత్తాచెదారం

రోడ్లు, డ్రెయినేజీల పనులు ప్రారంభం

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని ఏటిగైరం పేట పంచాయతీ సీతకండి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు నల్లబెల్లి స్వామి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చురుగా జరుగు తున్నాయన్నారు.

చేపడుతున్న రోడ్డు పనులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగేవరకూ ఉద్యమం

-సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతంగా నిర్వహిస్తామని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు చెప్పారు. సిపిఎం స్టీల్ జోన్ 5 మహాసభను వడ్లపూడి నిర్వాసిత కాలనీలోని వైష్ణవి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లలో జోన్ పరిధిలో ఉన్న అనేక సమస్యలపై సిపిఎం పోరాటాలు నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిందని తెలిపారు. ప్రధానంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ చేయని కృషి సిపిఎం చేసిందన్నారు. ఈ మూడేళ్ల కాలంలో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటు అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో బైక్ ర్యాలీ నిర్వహించామని, 1500 కిలోమీటర్లు ఈ బైక్ యాత్రలో ఉత్తరాంధ్ర ప్రజానీకంలోకి స్టీల్‌ప్లాంట్ అంశాన్ని బలంగా తీసుకెళ్లగలిగామన్నారు. తద్వారా స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో ప్రజల్ని మమేకం చేశామని చెప్పారు. 16500 మంది నిర్వాసితుల త్యాగ ఫలితంగా ఏర్పడిన విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును ప్రయివేటు వారికి కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తున్న బిజెపి వైఖరిని ఎండగట్టారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి జనసేన బిజెపి కూటమి మాటల్లో ప్రయివేటీకరణకు వ్యతిరేకం అంటూనే, ప్లాంటును కాపాడుతామని చెబుతూనే ఆచరణలో ప్రయివేటీకరణ చేసే చర్యలు ఉన్నాయన్నారు. దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపడానికి గనులు కేటాయించాలని, నిర్వాసితుల్లో మిగిలిన 8500 మందికి శాశ్వత ఉపాధి కల్పించాలని, సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి సరుకుల సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తీర్మానాలు

ఈ మహాసభలో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకం ఆపాలని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, ఉద్యోగులను తొలగించరాదని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, కూర్మన్నపాలెం దువ్వాడ రోడ్డు విస్తరించాలని, దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రధానమైన రైళ్లు ఆపాలని, వడ్లపూడి రైల్వే బ్రిడ్జి పూర్తి చేయాలని, రామచంద్ర నగర్ డంపింగ్ యార్డ్ తొలగించాలని, ఫార్మాసిటీ నుంచి కాలుష్యాన్ని అరికట్టాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని సభలో తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

జోన్ కార్యదర్శిగా శ్రీనివాసరాజు

మహాసభలో స్టీల్ జోన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జోన్ కార్యదర్శిగా రెండవసారి పివిఎస్‌బి.శ్రీనివాసరాజు ఎన్నిక య్యారు. సభ్యులుగా జె.అయోధ్యరాం, యు.రామస్వామి, టివికె.రాజు, ఎన్.రమణ, జి.శ్రీనివాస్, బి.తౌడన్న, కె.వేణు, బి.గుర్రప్ప, జి.సూరిబాబు, యు.మరిడయ్య, జి.పుల్లారావు, డి.వెంకట్రావు, యు.సోమేష్, వై.అప్పలరాజు ఎన్నికయ్యారు.

నినాదాలు చేస్తున్న నాయకులు, బస్ డ్రైవర్లు

హైర్ బస్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నర్సీపట్నంటౌన్:నర్సీపట్నం డిపో నుండి నడుపుతున్న హైర్ (అద్దె) బస్ డ్రైవర్లకు గత కొన్ని నెలల నుండి జీతాలు ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో డిపో వద్ద డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, స్థానిక డిపో నుండి 6727,6728 (ప్రశాంతి), 1307,1308,3046 (బార్గవ్) నెంబర్ల గల బస్ డ్రైవర్లకు గత ఆరు నెలలుగా ఓనర్లు జీతాలు చెల్లించ లేదని తెలిపారు. జీతాలు అనేక మార్లు అడిగినప్పటికీ ఓనర్లు పంట్టించుకో లేదని, బకాయి జీతాలు చెల్లించ మని అడితే బెదింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై త్వరితగతిన డిపో మేనేజర్ జోక్యం చేసుకొని డ్రైవర్లకు చెల్లించాల్సిన జీతాలు ఇప్పించాలని సక్రమంగా జీతాలు చెల్లించాలని, లేకుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు ఎ దనంజయరావు, కెఅర్ బాబు, ఎం.నానాజీ, ఎంఎ రాజు,ఎస్ఎన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాలు కిటకిట

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో పర్యాటక కేంద్రాలు కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దారమట్టం జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

శిక్షణ ఇస్తున్న మాస్టర్

చిన్నారులకు నృత్య శిక్షణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనం మాస్టర్ శ్రీ గజముఖ నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం పిల్లలకు గజ్జెలు కట్టి నృత్య శిక్షణ ప్రారంభించారు. ఆంధ్ర నాట్యం, పేరిణి శివతాండవం, వన జనార్దన పారిజాతం వంటి నృత్యాల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తె లిపారు. ప్రస్తుత యువత అంతా కలలు, నృత్యాలు నేర్చుకోలేదని, తాము ఉన్నంతవరకు కొంతవరకైనా ప్రస్తుత యువతకు శిక్షణ ఇస్తామన్నారు.

సారా, బెల్లు దుకాణాలను నియంత్రిస్తాం

ప్రజాశక్తి -చింతపల్లి :-మన్యంలో నాటు సారా, మద్యం గొలుసు దుకాణాలను నియంత్రిస్తామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ జే కూర్మారావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల్లో ఎక్కడైనా మద్యం గొలుసు దుకాణాలు, నాటు సారా, నల్ల బెల్లం, అమోనియా క్రయ విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారంలోనే తమ సిబ్బందితో రైడ్ చేసి రెండు మద్యం గొలుసు దుకాణాలలో 56 మద్య సీసాలు పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించామన్నారు., నాటు సారాకి ఉపయోగించే నల్లబెల్లం పులుపు 1600 లీటర్లు ధ్వంసం చేశామని తెలిపారు.గొలుసు దుకాణాలకు లైసెన్స్ దుకాణదారులు మద్యం సీసాలు సరఫరా చేస్తే మొదటిసారిగా ఐదు లక్షల రూపాయలు జరిమానా విధించి, మరోసారి దొరికితే లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు.మద్యం సీసాలు ఎమ్మార్పీ ధరకే అమ్మాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చిన్న పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవం వాలంటీర్లకు బాధ్యతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఈ నెల 19,20,21 తేదీలలో సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్లో జరగనున్న విశాఖ బాలోత్సవం నిర్వహణకు సంబంధించి వాలంటీర్ల సమావేశం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. బాలోత్సవంకు సంబంధించి ఇప్పటికే పాఠశాలల నుండి ఎంట్రీ ఫారాలు అందజేయగా మంచి స్పందన వచ్చింది. ఒకే రోజు 26 ఈవెంట్స్, వేల మంది విద్యార్థులకు ఈ పోటీలు జరుగుతాయి. ఈ నిర్వహణలో వాలంటీర్లు ఎంతో కీలకం. అందుకే వలంటీర్లకు బాధ్యతలు అప్పగిస్తూ సమావేశంలో నిర్ణయించారు.అలాగే జరిగే ప్రతి ఈవెంట్ కీ ప్రత్యేకంగా న్యాయ నిర్ణేతలు ఉండేలా ఏర్పాట్లు చేశారు.ఈవెంట్స్ నిర్వహణకు సంబంధించి వాలంటీర్స్ పనిచేస్తారు. కాలేజీ చదువుతున్న 120 మందికి పైగా విద్యార్థులు నిర్వహణకు స్వచ్ఛందంగా పని చేస్తారు.వివిధ కమిటీలు ఏర్పాటు చేశారు.వాలంటీర్స్ కోఆర్డినేటర్ గా ఎం.గుణ శంకర్ ,కమిటీ సభ్యులు గా శశి కుమార్,సాయి తేజ,సాయి కుమార్, అజయ్ నియమితులు అయ్యారు.ఈ సమావేశంలో బాలోత్సవం నిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి జి.ఎస్ రాజేశ్వరరావు, అధ్యక్షులు రఘు పిల్లలమర్రి, కె.రమాప్రభ, ఎం.ఎల్లాజీ, దండు నాగేశ్వరరావు, కృష్ణారావు, సతీష్ పాల్గొన్నారు.

హాజరైన వాలంటీర్లు

పామాయిల్ సాగుపై ఆసక్తి కనబరచాలి

-కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి- మాడుగుల:రైతులందరూ పామాయిల్ సాగుపై ఆసక్తి కనబరచాలని వ్యవసాయ రైతు సంక్షేమ సంఘం డైరెక్టర్ అజిత్ కుమార్ సాకు అన్నారు. ఆదివారం చోడవరం, మాడుగుల, బుచ్చయ్యపేట మండలాల్లో కేంద్ర బృందంతో కలిసి పర్యటన చేశారు. పామాయిల్ మెగా ప్లాంటేషన్‌లో భాగంగా మాడుగుల మండలం చింతలూరు గ్రామంలో పాసుమర్తి బ్రహ్మానందం, శ్రీవణ్ పొలాల్లో పామాయిల్ సాగు తో పాటు అంతర పంట కోకో, వక్క పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ, రైతులందరూ పామాయిల్ సాగుపై ఆసక్తి కనబరిచి, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలతో లాభ సాటి వ్యవసాయంగా ఉపయోగించుకోవాలని రైతులను కోరారు.1200 ఎకరాల్లో పామాయిల్ రైతులు సాగు చేస్తున్న విధానాన్ని చూసి కేంద్ర బృందం ఆనందం వ్యక్తం చేశారు. పామ్ ఆయిల్ తోటల్లో సోలార్ బోర్లను సబ్సిడీపై ఇప్పించవలసిందిగా అధికారులను రైతుల కోరారు. ఈ కార్యక్రమంలో రణవీర్ సింగ్, నూనె గింజల అభివృద్ధి డైరెక్టర్ ఎస్.కె పొన్ను స్వామి, అగ్రికల్చర్ డైరెక్టర్ ఏడిఎఫ్ బాలాజీ, ఉద్యానవన శాఖ డివిజనల్ అధికారిని భాను పుష్ప లీలావతి, నాయక్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

గిరిజన ప్రాంతాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

నినాదాలు చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

ప్రజాశక్తి కోటవురట్ల:గిరిజన గ్రామాలకు శాశ్వత రహదారి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం అణుకు గిరిజన ప్రాంతంలో జరిగిన సిపిఎం సమావేశంలో ఆయన పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలో కోదండరామపురం, తడపర్తి రహదారులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయన్నారు.వైసిపి ప్రభుత్వంలో సిపిఎం పోరాట ఫలితంగా 32లక్షలతో నిర్మాణం చేపట్టిన మెటల్ గ్రావెల్ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల దెబ్బతిన్నాయన్నారు. ఆయా ప్రాంతాలకు తారు రోడ్లు నిర్మాణం చేపట్టాలని, రాష్ట్ర హోం మంత్రి అనిత గిరిజన గ్రామాలకు ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసి రహదారులు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఏం సత్యనారాయణ, జి.డేవిడ్ రాజు, ఎం రాజేష్, సన్యాసిరావు, సూరిబాబు పాల్గొన్నారు.